క్లుప్తంగా

ఇద్దరు ఎస్సైల బదిలీ

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో ఇద్దరు ఎస్సైలు బదిలీ అయ్యారు. కలువాయి ఎస్సై ఎ.అయ్యప్పను నెల్లూరులోని చిన్నబజారు పోలీస్ స్టేషన్‌కు, వీఆర్‌లో ఉన్న కె.సుమన్‌ను కలువాయి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ జి.కృష్ణకాంత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రూరల్ పీడబ్ల్యూఏ కన్వీనర్‌గా ప్రసాద్


ప్రసాద్

నెల్లూరు(బృందావనం) : పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(పీడబ్ల్యూఏ) నెల్లూరు రూరల్ మండల కన్వీనర్‌గా పాస్టర్ సీహెచ్ ప్రసాద్‌ను నియమించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం హనోక్, రాష్ట్ర అధ్యక్షుడు ఐఎస్ బెన్హర్‌బాబు ఆధ్వర్యంలో రైల్వేఫీడర్స్‌రోడ్డులోని లోన్‌స్టార్ చర్చిలో జరిగిన మండల సమావేశంలో తనను నియమించారని ప్రసాద్ బుధవారం వివరించారు. మండలంలోని పాస్టర్లకు ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

నిర్లక్ష్యంగా వదిలేస్తే ఎలా..


విద్యుత్ లైన్లపై పడిన ప్లాస్టిక్ పట్ట

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ లైన్ల సమీపంలో ఎలాంటి ఫ్లెక్సీలు కట్టొద్దని, నిర్మాణాలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులు నిత్యం విజ్ఞప్తి చేస్తుంటారు. అయితే కొందరు ఇవేమీ పట్టించుకోవడం లేదు. ఇంటి నిర్మాణ సమయంలో కడుతున్న ప్లాస్టిక్ పట్టలు విద్యుత్ లైన్లపై పడి సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగిస్తోంది. నగరంలోని లక్ష్మీపురంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి సంబంధించిన ప్లాస్టిక్ పట్ట విద్యుత్ లైన్లపై పడింది. దీని వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

విద్యాసామగ్రి అందజేత



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : 54వ డివిజన్ జనార్దనరెడ్డి కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా చిన్నారులకు విద్యాసామగ్రిని బుధవారం అందజేశారు. వికలాంగుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, వైద్యులు సాయినాథ్, జక్కావుల్లా, గుమ్మడి శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు నేడు

నెల్లూరు(దర్గామిట్ట): జెడ్పీకి సంబంధించిన ఏడు స్టాండింగ్ కమిటీ సమావేశాలను గురువారం నిర్వహించనున్నామని సీఈఓ కన్నమనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశాలకు స్థాయీ సంఘాల చైర్మన్లు, సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

దాడి కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): కార్యాలయంలో పనిచేసేందుకు వచ్చిన ముగ్గురు వ్యక్తులపై దాడి చేసిన ఘటనలో నిందితులను వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. బీవీ నగర్‌లో ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ ఉంది. అందులో మేనేజర్‌గా పీటర్, ఏసీ టెక్నీషియన్‌గా శిరీష్‌లు పని చేస్తున్నారు. ఈ సెంటర్‌లో పనిచేసేందుకు వారు ఒడిశాకు చెందిన జుహేంద్ర దుంబూరి, పద్మిని దుంబూరి దంపతులతోపాటు మరో వ్యక్తిని ఈనెల 27వ తేదీన తీసుకొచ్చారు. అర్ధరాత్రి మేనేజర్, ఏసీ టెక్నీషియన్ మద్యం మత్తులో వారిపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్ కిశోర్‌కుమార్ తెలిపారు.

దుస్తుల పంపిణీ

నెల్లూరు(బృందావనం) : బాలాజీనగర్ మెయిన్ రోడ్డు కృష్ణాష్టమి సెంటర్‌లో బుధవారం పేదలకు దుస్తులను అందజేశారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఉత్సవాల నిర్వాహకుడు కొట్టే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

సీఎం వ్యాఖ్యలు బాధాకరం

నెల్లూరు(బృందావనం) : మత మార్పిడులపై సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు బాధాకరమని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ రాజశేఖర్ దాసరి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రతికా ప్రకటన విడుదల చేశారు.

ఆ ఆరోపణలు సరికాదు

నెల్లూరు(బారకాసు): గొలగమూడి ఆరాధనోత్సవాల్లో వెంకయ్యస్వామి కుటుంబ సభ్యులపై ఆలయ ఈఓ బాలసుబ్రహ్మణ్యం చేసిన ఆరోపణలను వెంకయ్యస్వామి కుటుంబ సభ్యుడు సోంపల్లి పెంచలయ్య ఖండించారు. జర్నలిస్ట్ భవనంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈఓ తమపై లేనిపోని ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదని తెలిపారు.

భద్రతాపరమైన చర్యలు చేపట్టాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన అమానుషం. ఈ ఘటనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచారణను వేగవంతం చేసి దోషులను కఠినంగా శిక్షించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆస్పత్రుల్లో భద్రతాపరమైన చర్యలు చేపట్టాలి. వైద్యసిబ్బంది రక్షణకు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలి.

– బీ నరసమ్మ, హెల్త్‌సూపర్‌వైజర్, చేజర్ల పీహెచ్‌సీ

మంచి బుద్ధులు నేర్పాలి



దాడులకు పాల్పడటం నేరం. ప్రజల్లోనే మార్పు రావాలి. చిన్న వయస్సు నుంచే పిల్లలకు మంచి బుద్ధులను నేర్పాలి. దీంతో మార్పొస్తుంది. భవిష్యత్తు తరాలకు రక్షణ కల్పించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేయాలి.

– ఉషాసుందరి, ఆర్ఎంఓ, ప్రభుత్వాస్పత్రి, ఆత్మకూరు



గణేశ్ ఉత్సవాలను విజయవంతం చేయండి

- నగరంలోని రెండు ఘాట్ల వద్ద పక్కాగా ఏర్పాట్లు
- వివిధ శాఖల అధికారులకు జేసీ దిశానిర్దేశం


మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరు(దర్గామిట్ట): వచ్చే నెల 7న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని అధికారులందరూ సమన్వయంతో పనిచేసి గణేశ్ నిమజ్జన వేడుకలను విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ సూచించారు. కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో ఉత్సవ ఏర్పాట్లపై శాఖల వారీగా జేసీ బుధవారం సమీక్షించారు. ఇరగాళమ్మ గుడి, పెన్నానది ఘాట్ల వద్ద చేపడుతున్న ఏర్పాట్లను అడిషనల్ కమిషనర్ శర్మద, ఈఈ చంద్రయ్య జేసీకి వివరించారు. ఘాట్ల వద్ద రూ.1.60 కోట్లతో సివిల్ వర్క్స్ చేపడుతున్నట్లు చెప్పారు. రెండు ఘాట్ల వద్ద రిసెప్షన్ సెంటర్ల ఏర్పాటు, తాగునీటి స్టాల్స్, బారికేడ్స్, హైడ్రాలిక్ క్రేన్లు, గ్రానైట్ రిపేర్లు, రోడ్ల ప్యాచ్ వర్క్స్, మొబైల్ టాయిలెట్స్, ఎల్ఈడీ లైటింగ్, ఫ్లడ్‌లైట్లు, సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు, పెయింటింగ్, పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్, సాంస్కృతిక కార్యక్రమాలకు స్టేజీ నిర్మాణాలు మొదలైన ఏర్పాట్లను చేపడుతున్నట్లు కార్పొరేషన్ అధికారులు జేసీకి వివరించారు. విగ్రహాల ఏర్పాటు, విద్యుత్, మైక్ పర్మిషన్లు ఎప్పటిలాగా ముందుగా తీసుకోవాలని, సెప్టెంబర్ 5వ తేదీలోగా అనుమతులకు దరఖాస్తులు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల సూచనలను కూడా జేసీ పరిగణనలోకి తీసుకుని అందుకు తగ్గట్లు అధికారులకు ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీలు సౌజన్య, శ్రీనివాసరెడ్డి, డీఆర్ఓ లవన్న, విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్, డీఎంహెచ్ఓ పెంచలయ్య, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, ఆర్అండ్‌బీ ఎస్ఈ గంగాధర్, ఆర్డీఓ మలోల, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు పిట్టి సత్యనాగేశ్వరరావు, సురేంద్రరెడ్డి, ఏవీఆర్ మోహన్‌రావు, శ్రీకాంత్, బయ్యా వాసు తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణతో వ్యాధులు దూరం

- మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ


ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ

నెల్లూరు(అర్బన్) : దోమలను నియంత్రించడం ద్వారా డెంగీ, మలేరియా లాంటి సీజనల్ వ్యాధులను దూరం చేయవచ్చని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ అన్నారు. స్థానిక చంద్రమౌళినగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని పోలీస్ కాలనీ, సచివాలయ ప్రాంతాల్లో వైద్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి లార్వా సర్వే, ఫీవర్ సర్వేను బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా హుస్సేనమ్మ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో డెంగీ కేసు నమోదవడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకుంటే విషజ్వరాలు రావన్నారు. కీటకజనిత వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రజలు తమ ఇళ్లు, ఇంటి పరిసరాల్లో కొద్దిపాటి నీరు కూడా నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ మలేరియా నివారణాధికారి నాగార్జునరావు, ఎస్‌యూఓ జయరాం, శ్యాంసన్‌బాబు, రామారావు, ఆరోగ్య పర్యవేక్షకుడు శ్రీధర్, హెల్త్ అసిస్టెంట్ నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కొరత రాకుండా చర్యలు


మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ఇసుక కొరత రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ అన్నారు. జిల్లాలో గుర్తించిన ప్రదేశాల్లో ఇసుక డీసిల్టేషన్ ప్రక్రియను చేపట్టేందుకు ఆసక్తి చూపిన వారితో ఆయన బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సమావేశమయ్యారు. టెండరింగ్ విధానంతో ఆలస్యమై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని, ఈ ప్రక్రియను చేపట్టేందుకు ఆసక్తి ఉన్న వారితో ప్యానెల్ లిస్ట్‌ను తయారు చేశామన్నారు. జిల్లాలోని సూరాయపాళెం, సంగం, నెల్లూరు బ్యారేజీల వద్ద గల ప్రాంతాల్లో డ్రెడ్జింగ్ చేసి ఇసుక డీసిల్టేషన్ ప్రక్రియను చేపడుతున్నామన్నారు. సమావేశంలో మైన్స్ ఉపసంచాలకులు శ్రీనివాసరావు, డీటీసీ చందర్, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ, దత్తతపై కలెక్టర్ సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట) : మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న జిల్లా బాలల సంరక్షణ పథకం, బాలల సంక్షేమ సమితి సిబ్బందితో కలెక్టర్ ఒ.ఆనంద్ బుధవారం తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శిశుగృహంలో ఉన్న చిన్నారుల్లో ఇప్పటి వరకు ఎంత మందిని దత్తత ఇచ్చారు? ఎంతమందిని దత్తత ఇవ్వాలి? ఆన్‌లైన్ ప్రక్రియలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా? తదితర సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఎన్‌జీఓ ద్వారా నిర్వహిస్తున్న అనాథ శరణాలయాల్లో ఎంతమందిని దత్తత ఇచ్చారో ఆరాతీశారు. ఇప్పుడు గుర్తించిన 15 మంది బాలలను దత్తత ప్రక్రియలోకి తీసుకురావాలని, ఇది ఆలస్యం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.హేనాసుజన్, చైర్‌పర్సన్ టి.మాధవి, డీసీపీఓ బి.సురేష్, సీడబ్ల్యూసీ సభ్యులు ఎం.నిహారిక, రాజ్యలక్ష్మి, ఐసీపీఎస్ సిబ్బంది సుమలత, సమత, మంజుల పాల్గొన్నారు.

రైలు పట్టాలు దాటుతుండగా..

నెల్లూరు(క్రైమ్): పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం వేదాయపాళెం రైల్వేస్టేషన్ సమీపంలో నెల్లూరు వైపు వచ్చే పట్టాలపై జరిగింది. మృతుడి వయస్సు 50 నుంచి 55 ఏళ్లలోపు ఉండొచ్చని భావిస్తున్నారు. పసుపు రంగు ఫుల్ హ్యాండ్స్ చొక్కా, నీలి రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు స్పోర్ట్స్ ర్యాలీ


లెమన్ అండ్ స్పూన్ రేస్‌లో పాల్గొన్న మహిళలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద నుంచి గురువారం ఉదయం 7 గంటలకు క్రీడా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్కే యతిరాజ్ తెలిపారు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, త్రోబాల్, యోగా, లెమన్‌అండ్ స్పూన్ రేస్ తదితర పోటీలను నిర్వహించారు. క్రీడా ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సెట్నెల్ సీఈఓ వెంకటయ్య, జిల్లాక్రీడా ప్రాధికార సంస్థ కోచ్‌లు, వివిధ విభాగాలకు చెందిన క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖలీల్‌కు పలువురి పరామర్శ


ఖలీల్ అహ్మద్‌ను పరామర్శిస్తున్న కొండ్రెడ్డి రంగారెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగర డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్‌ను నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి బుధవారం పరామర్శించారు. ఆయురారోగ్యాలతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పాశం శ్రీనివాస్, ఏసునాయుడు, సూరిబాబు, ఖలీల్ తదితరులు ఖలీల్‌ను పరామర్శించారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

- ఏఐఎస్ఎఫ్ రిలే నిరాహార దీక్ష


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు


నెల్లూరు(దర్గామిట్ట) : రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మొటిక్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో విద్యార్థులు చాలీచాలని వసతులతో ఇబ్బందులు పడుతున్నారని, అనేక మార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కనీసం ఆ భవనాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని మండిపడ్డారు. తక్షణమే ప్రభుత్వం సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. వసతగృహాల మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వ ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలన్నారు. నెల రోజుల్లో సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకపోతే చలో సచివాలయానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. గత 15 రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ వసతిగృహాలను సందర్శించామని, నగరంలో ఉన్న కొన్ని వసతిగృహాల్లో పూర్తిస్థాయిలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ కిశోర్, నెల్లూరు నగర అధ్యక్షుడు శివం వర్మ, జిల్లా నాయకులు ప్రసాద్, అబ్దుల్, జాహ్నవ్, యస్దాని, నరసింహ, శరణ్, జీవన్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా వ్యవహరించండి


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్) : శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని, కఠినంగా వ్యవహరించాలని నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి సూచించారు. ఆయన తన కార్యాలయంలో నగర ఇన్‌స్పెక్టర్‌లతో నేర సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. రాత్రి గస్తీలను ముమ్మరం చేయాలని, నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో నగర ఇన్‌స్పెక్టర్‌లు చిట్టెం కోటేశ్వరరావు, షేక్ అన్వర్‌బాషా, మద్ది శ్రీనివాసరావు, రోశయ్య, కిశోర్‌కుమార్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట



నెల్లూరు(బృందావనం) : సంతపేట శ్రీనివాసపురంలోని మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ట బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఉభయకర్తలుగా గుర్రం బద్రినారాయణ, విజయలక్ష్మి దంపతులు వ్యవహరించారు.

వికసిత్ ఆంధ్రప్రదేశ్‌పై వర్క్‌షాప్

నెల్లూరు(బారకాసు) : వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047పై స్థానిక మెప్మా కార్యాలయంలో శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో మెప్మా పీడీ రవీంద్ర పాల్గొని పలు అంశాలపై విస్తృతంగా వివరించారు. జీవనోపాధుల అభివృద్ధి((ఎన్‌డీసీ)- ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్)లో స్వయం సహాయ సంఘాల ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయాలు, వర్ధబుల్ గ్రూప్ ఏర్పాటు, సంఘ సభ్యులకు డిజిటల్, ఆర్థిక నిబద్ధత, భిక్షగాడు లేని సిటీ వంటి అంశాలు లక్ష్యంగా పీడీ పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఈఐబీ అంకయ్య, టీఈఎల్‌హెచ్ సుధాకర్, టీఈబీఎల్ సురేంద్ర, టీఈఎస్ఎస్ కాంతయ్య, హెచ్ఎస్ హర్షిత, పలు మున్సిపాలిటీల సీఎంఎంలు, సీఓలు పాల్గొన్నారు.

ప్యూర్ ఈవీ కంపెనీకి ఫోరం మొట్టికాయ

- కొత్త వాహనాన్ని ఇవ్వాలని ఆదేశం

నెల్లూరు లీగల్: లోపభూయిష్ట ఎలక్ట్రిక్ స్కూటర్‌ను తీసుకొని కొత్త వాహనాన్ని ఫిర్యాదికి ఇవ్వాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి జింకారెడ్డి శేఖర్, మెంబర్ బాలసుధ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. వివరాలు.. నగరంలోని డైకస్‌రోడ్డు, శాంతినగర్‌కు చెందిన లావణ్య మినీబైపాస్ రోడ్డులోని ప్యూర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ డీలర్ వద్ద ఈ ప్లూటో 7జీ మోడల్ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను మూడేళ్ల వారంటీతో రూ.85 వేలకు 2021, సెప్టెంబర్ తొమ్మిదిన కొనుగోలు చేశారు. ఆ తర్వాత వారం రోజులు నుంచే స్కూటర్‌కు రిపేర్లు మొదలయ్యాయి. ఈ తరుణంలో వాహనాన్ని డీలర్ వద్దకు తీసుకెళ్లగా, తాత్కాలికంగా రిపేర్లు చేసి ఇచ్చారు. ఇలా తరచూ సమస్యలు వస్తూనే ఉన్నాయి. వారంటీ ఉన్నా ఉచిత సర్వీస్ చేయకుండా ఆమె నుంచి డబ్బులను వసూలు చేయసాగారు. గతేడాది ఫిబ్రవరిలో స్కూటర్ బ్యాటరీతో పాటు ఇతర సమస్యలు రావడంతో డీలర్ వద్దకు తీసుకెళ్లారు. సాంకేతిక నిపుణుల కొరత, విడి భాగాల లభ్యత తదితర కారణాలు చెప్పి వారు తప్పించుకునేందుకు యత్నించారు. దీంతో విసిగిపోయిన బాధితురాలు ఉమ్మడి నెల్లూరు జిల్లా వినియోగదారుల ఫోరంలో ప్యూర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, నెల్లూరు బ్రాంచి మేనేజర్.. సీఈఓ, హైదరాబాద్‌పై కేసును న్యాయవాది ద్వారా దాఖలు చేశారు. పాత స్కూటర్‌ను వెనక్కి తీసుకొని.. 30 రోజుల్లో నూతన వాహనం, కోర్టు ఖర్చులు రూ.మూడు వేలను బాధితురాలికి చెల్లించాలని ఫోరం కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

క్రీడా పురస్కారాల ప్రదానం నేడు

నెల్లూరు (టౌన్) : హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు డీఈఓ రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో జిల్లా స్థాయిలో క్రీడల్లో ప్రతిభ కనబరిచిన ఐదు పాఠశాలలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎంపికైన పాఠశాలల హెడ్ మాస్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు హాజరు కావాలన్నారు.

ఘన సన్మానం



నెల్లూరు(బృందావనం): టౌన్ హాల్లో ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ కాలేషాను బుధవారం ఘనంగా సన్మానించి లెజెండ్రీ అవార్డు అందజేసినట్లు కార్యక్రమ నిర్వాహకుడు కేతా సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో బలరామయ్య నాయుడు, అబ్దుల్ రహీం, ఖాదర్‌బాషా, సలీం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

పెద్దాస్పత్రిలో చెవిపై కణితి తొలగింపు

నెల్లూరు(అర్బన్) : నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి)లో రూపాయి ఖర్చు లేకుండా ఓ బాలిక చెవిపై ఏర్పడిన అరుదైన గడ్డ(కణితి)ను వైద్యులు విజయవంతంగా తొలగించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఈఎన్‌టీ స్పెషలిస్టు డాక్టర్ సుకుమార్ బుధవారం తెలిపారు. ఇందుకూరుపేట మండలం కొమరిక గ్రామానికి చెందిన ఉప్పాల శీనయ్య, పోలమ్మ దంపతుల కుమార్తె ఉప్పాల కృప చెవితమ్మెపై లోబ్యులర్ కీలాయిడ్ అనే గడ్డ(కణితి) కొంతకాలంగా పెరుగుతోంది. దీంతో వారు నగరంలోని ప్రైవేటు ఈఎన్‌టీ ఆస్పత్రులకు వెళ్లారు. ఆపరేషన్‌కు ఎక్కువ ఖర్చు అవుతుందని చెప్పడంతో ఎనిమిది రోజుల క్రితం పెద్దాస్పత్రికి వచ్చారు. ఈఎన్‌టీ డాక్టర్ సుకుమార్ ఆధ్వర్యంలో సర్జరీ చేశారు. ఈ సర్జరీలో డాక్టర్లు శ్రీదేవి, కల్యాణి, ఆశా పాల్గొన్నారు. మత్తు డాక్టర్లు శారద, ప్రియాంక సహకారంతో సర్జరీ పూర్తి చేశారు. ప్రస్తుతం గాయం మానిపోవడంతో బుధవారం కుట్లు తొలగించారు.

వ్యక్తిగత శుభ్రతపై దృష్టి సారించాలి


ఉపాధ్యాయులకు సర్టిఫికెట్ల ప్రదానం

నెల్లూరు (టౌన్) : విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతపై దృష్టి సారించాలని ఏఎంఓ సుధీర్‌బాబు తెలిపారు. స్థానిక దర్గామిట్టలోని జెడ్పీ హైస్కూల్‌లో డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియాలో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలల ఉపాధ్యాయులకు హ్యాండ్ వాష్‌పై బుధవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా శుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు సయ్యద్ హమీద్ అమీర్, మురళీధర్, డీబీఎస్ఐ స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్ కుమారి, జిల్లా మేనేజర్ విష్ణువర్ధన్, రిసోర్స్ పర్సన్ ప్రసాద్, వలంటీర్లు ఈశ్వరయ్య, శివకుమార్ పాల్గొన్నారు.

కనుల పండువగా కృష్ణాష్టమి


తల్పగిరి రంగనాథస్వామి, కణ్ణన్‌ల పేట ఉత్సవం


స్వామివారి నగరోత్సవం


వేణుగోపాలస్వామి దేవస్థానంలో..

నెల్లూరు(బృందావనం) : కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా రంగనాయకులపేటలోని రంగనాథస్వామి దేవస్థానంలో తల్పగిరి రంగనాథస్వామి, కణ్ణన్(శ్రీకృష్ణ)లకు బుధవారం తిరుమంజనం నిర్వహించారు. రాత్రి ఉట్టి మహోత్సవం వేడుకగా చేపట్టారు. ఈ క్రమంలో పేట ఉత్సవం వైభవంగా జరిగింది. ఉభయకర్తలుగా రౌతు నరసింహారావు వ్యవహరించారు. కార్యక్రమాలను ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

- మూలాపేటలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో శ్రీకృష్ణ అవతార మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు బుధవారం స్వామివారు 'ఉట్టి మహోత్సవ' అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఆత్మకూరు వెంకటరాజామోహన్‌రావు వ్యవహరించారు. కార్యక్రమాలను దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈఓ డి.చంద్రశేఖర్‌రావు పర్యవేక్షించారు.
- భక్తవత్సలనగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం బుధవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. అనంతరం స్వామివారి నగరోత్సవం వేడుకగా సాగింది. భక్తవత్సలనగర్, ఉమ్మారెడ్డిగుంట, ఎన్జీఓ కాలనీ తదితర ప్రాంతాల్లో నగరోత్సవం సాగింది. భక్తులు విశేషంగా హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను అనంగి రమణయ్యయాదవ్, పాముల రమణయ్య యాదవ్, దేవరాల వెంగయ్యయాదవ్ పర్యవేక్షించారు. టీడీపీ నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, చేజర్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి



మా మిత్రుడు పాలకొండ ప్రశాంత్‌రెడ్డి గారి తండ్రి గారైన
శ్రీ పాలకొండ సుబ్బారెడ్డి గారు
తేది : 15-08-2024 న స్వర్గస్తులైనారు.
వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ...
వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.
మిత్రులు (Infant Jesus Public School - 1992 Batch)